క్లుప్తంగా

ఇంటివద్దే హాయిగా ఆటాపాటా



గోపాల్‌పేట: పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో అందరిపిల్లలూ సెల్‌ఫోన్లు, వీడియో గేమ్స్‌ ఆడుకునే ఈ రోజుల్లో నలుగురు చిన్నారులు కలిసి కట్టెలు, ఆకులతో ఇల్లు నిర్మించారు. అంతేకాకుండా అన్నం వండారు, కూర చేసుకున్నారు, చపాతీలు, భక్షాలు చేశారు, అన్నం తినేందుకు మోదుగాకులతో ఇస్తరాకులు తయారు చేసుకున్నారు. ఒక ఇంట్లో ఎలా వంటావార్పు చేసుకుంటారో చిన్నారులు అలా తయారు చేసుకున్నారు. బుధవారం గోపాల్‌పేట మండల కేంద్రంలో ఈ చిత్రం కనిపించగా 'సాక్షి' కెమెరా క్లిక్‌ మనిపించింది.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల స్థలాల పరిశీలన

వీపనగండ్ల: మండల కేంద్రంలో 52 మంది ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా నిర్ధారించగా, బుధవారం తహసీల్దార్‌ వరలక్ష్మి లబ్ధిదారుల ఇళ్ల స్థలాలను పరిశీలించారు. గ్రామంలోని ఇందిరమ్మ కమిటీ సభ్యులు అర్హులుగా గుర్తించిన వారి జాబితాలోని లబ్ధిదారుల పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నివేదికలు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రవీందర్‌రెడ్డి, కావలి మహేష్‌, ఎత్తం వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ అవార్డు రావడంపై హర్షం

చిన్నంబావి: మండలంలోని బెక్కెం గ్రామానికి చెందిన ప్రముఖ విద్యాసంస్థల అధినేత ధార సింగ్‌కు అంబేడ్కర్‌ ఎక్స్‌లెన్స్‌ అవార్డు రావడంపై శ్రీశైలం నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను బెక్కెం గ్రామంలో ఆయన నివాసంలో శాలువాతో సన్మానించారు.శ్రీశైలం నిర్వాసితుల సమస్యపై కేంద్ర మంత్రులను కలిసి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరడమే గాక హైకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం నాయకులు దావోజీ, నారాయణరెడ్డి, కృష్ణ, రంగస్వామి, విష్ణు సాగర్‌, కావలి గోపాల్‌, సాయి ప్రణీత్‌ గౌడు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణను వినియోగించుకోవాలి

కొత్తకోట రూరల్‌: జిల్లా యువజన క్రీడా శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని వ్యాయామ శిక్షకుడు యం.అజయ్‌కుమార్‌ తెలిపారు. మండలంలోని అప్పరాల జిల్లా పరిషత్‌ ఉన్న పాఠశాలలో నేటి నుంచి జూన్‌ 6వరకు ఉచిత వేసవి క్రీడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఉచిత కంప్యూటర్‌ శిక్షణ ప్రారంభం



ఆత్మకూర్‌: స్వామి వివేకానంద సేవా సమితి ఆత్మకూర్‌, వాగ్దేవి జూనియర్‌ కళాశాల వనపర్తి వారి ఆధ్వర్యంలో స్థానిక సరస్వతీ శిశు మందిర్‌ పాఠశాలలో బుధవారం ఉచిత కంప్యూటర్‌ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈనెల 1వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98484 56391, 77801 79152 నంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్వప్న, బాలు, సంతోష్‌, మ్యాడం శ్రీను, రవి, శ్రీనివాసరెడ్డి, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన డా.చిన్నారెడ్డి

వనపర్తి రూరల్‌: మండలంలోని మెట్టుపల్లి పెట్రోల్‌ పంపు దగ్గర కిష్టగిరి గ్రామానికి చెందిన మిద్దెల మాసన్న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బుధవారం పలు వివాహ కార్యక్రమాలకు హాజరై అటుగా వెళ్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి స్పందించి తన వాహనంలో అతన్ని వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మానవత్వం చాటుకు జి చిన్నారెడ్డికి కిష్టగిరి గ్రామస్తులు శాలువాతో సన్మానించారు.

కార్మిక, కర్షక సమస్యలపై నిరంతర పోరాటం

అమరచింత: కార్మిక, కర్షక సమస్యలపై రాజీలేని పోరాటం చేయడానికి సీపీఎం ముందుంటుందని రైతు సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్‌ అన్నారు. మండలంలోని కొంకన్వాని పల్లెలో బుధవారం సీపీఎం అనుబంధ కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. రోజువారి పని గంటల కోసం పోరాడిన అమరుల స్ఫూర్తితో మేడే ఉత్సవాలను గ్రామంలో మే 3న నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేష్‌, మొగిలన్న ఉన్నారు.

'పది'లో మెరిసిన విద్యార్థులు

- ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యార్థుల ఉత్తీర్ణత
- మండలాల్లో బాలికలదే పైచేయి


పూజ (577)


మనోజ్‌ (568)


నిఖిల్‌ (559)


గాయత్రి (546)


ప్రియాంక (543)


భువనేశ్వరి (543)


డి.సౌమ్య (540)


జి.లావణ్య (536)


తులసీగౌడ్‌ (536)


సాయికుమార్‌ (534)

సాక్షి, నెట్‌వర్క్‌: పదో తరగతి ఫలితాల్లో వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అత్యుత్తమ మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. ప్రైవేట్‌ పాఠశాలలకు దీటు ప్రభుత్వ బడుల్లో ఉత్తీర్ణత సాధించారు.

■ వనపర్తి మండలంలోని చిట్యాల ఎంజేపీ విద్యార్థులు మనోజ్‌కుమార్‌ 568/600, కె.లక్ష్మీనారాయణ 559/600 మార్కులు సాధించారు. కడుకుంట్ల ఎంజేపీ విద్యార్థి టి.రాకేష్‌ 555/600, లోకేష్‌ నాయక్‌ 544/600 మార్కులు సాధించారు. పెబ్బేర్‌ ఎంజేపీ విద్యార్థిని అనూష 548/600, మాడల్‌ స్కూల్‌ విద్యార్థి కె.జానకీరామ్‌ 546/600 సాధించారు.

■ శ్రీ రంగాపురం మండలంలో కేజీబీవీ పాఠశాలలో 42 మంది పరీక్ష రాయగా, 42మంది ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థి బీ నవ్య 541/600, జె వర్షిణి 523/600 సాధించి మండల టాపర్లుగా నిలిచారు.

■ కొత్తకోట మండలంలోని అమడబాకుల మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు ప్రియాంక 543, లావణ్య 536, పి.తులసీగౌడ్‌ 536, యం.సాయికుమార్‌ 534 మార్కులు సాధించారు.

■ అమరచింత మండలంలో 252 మంది పరీక్ష రాయగా, 160 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ భాస్కర్‌ సింగ్‌ తెలిపారు. కేజీబీవీ విద్యార్థిని డి.సౌమ్య 540/600 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

■ పెద్దమందడి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ బాణం విష్ణు తెలిపారు. జెడ్పీహెచ్‌ఎస్‌లో 524 మార్కులతో ముగ్గురు విద్యార్థులు ఏ.కార్తీక, జి.మేఘన, ఎన్‌.జస్వంత్‌ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. జగత్‌పల్లిలో భువనేశ్వరి 543/600, పెద్దమందడి కేజీబీవీలో గాయత్రి 546/600, అక్షయ 541/600 మార్కులు సాధించారు. ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ పాఠశాల రాజాపేట 554/600 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు. సోషల్‌ వెల్ఫేర్‌ బాలికల రెసిడెన్షియల్‌లో జ్యోతి 536/600 మార్కులు సాధించింది.

■ ఆత్మకూర్‌ మండలంలోని తిప్డంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి నిఖిల్‌ 559/600 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. బాలికల ఉన్నత పాఠశాలలో హర్షిత, రూప 532 మార్కులు సాధించారు. కేజీబీవీ వైష్ణవి 531, పిన్నంచర్ల స్వాతి 531 మార్కులు సాధించారు. పూజ శ్రీవాణి 577, ఆమీనసమ్రీన్‌, అక్షర 576 మార్కులను సాధించారు.

■ మదనపురం కేజీబీవీలో వి. మధుశాలిని 526/600 మార్కులు సాధించింది.

■ ఆత్మకూర్‌ మండలంలోని జూరాలకు చెందిన వికలాంగ విద్యార్థిని అనురాధ 393 మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించింది.

■ వీపనగండ్ల మండలంలో 98.7 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ నర్సింహులు తెలిపారు. 140 మంది పరీక్షలకు హాజరు కాగా, 138 మంది ఉత్తీర్ణత సాధించారు. కల్వరాలలో రిషిత 530/600 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలువగా, వీపనగండ్ల బాయ్స్‌ పాఠశాలలో రోషి 512 మార్కులు, తూముకుంట వైష్ణవి 509 మార్కులు సాధించారు.

■ చిన్నంబావి మండలంలోని పెద్దదగడ విద్యార్థి శ్రీనివాసులు 538/600 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. దగడపల్లి మునీశ్వరి 537 మార్కులతో మండల ద్వితీయ ర్యాంకు సాధించింది. కస్తూర్బాలో మండల టాపర్‌గా నందిని 554 మార్కులు, ద్వితీయ ర్యాంకు ప్రణవిరెడ్డి 549 మార్కులు సాధించారు.

■ పాన్‌గల్‌ మండలంలో 79.89 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. చింతకుంటలో తస్లీమ్‌బేగం 538/600, కస్తూర్బాలో మానిక 533/600, పాన్‌గల్‌లో పల్లవి 524 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు.

■ ఖిల్లాఘనపురం మండలంలో కేజీబీవీ విద్యార్థిని ప్రసన్న 544 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. బాలికల ఉన్నత పాఠశాలలో అనురాధ 542 మార్కులతో రెండో స్థానం, కేజీబీవీ ఇంగ్లిష్‌ మీడియం విద్యార్థిని గంగ 534 మార్కులతో మూడో స్థానం, అప్పారెడ్డిపల్లిలో విద్యార్థిని ఏ. శిరీష 523 మార్కులతో 4వ స్థానంలో నిచింది.

■ ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో బుద్దారం గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు లావణ్య 569, వెన్నెల 561, శ్వేత 547 మార్కులు సాధించారు. రేవల్లి తెలుగు మీడియం పాఠశాలలో వందశాతం పాసయ్యారు.

అంబేడ్కర్‌ అందరివాడు

- మక్తల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ వాకిటి శ్రీహరి
- తూంపల్లిలో అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణ


తూంపల్లిలో అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న మక్తల్‌ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్‌: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీంరావ్‌ బాబసాహేబ్‌ అంబేడ్కర్‌ ఏ ఒక్క కులానికి చెందిన వారు కాదని దేశంలోని అన్ని కులాలకు, మతాలకు చెందిన అందరివాడని మక్తల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఆత్మకూర్‌ మండలంలోని తూంపల్లిలో అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణలో పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్‌ రూపొందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని, తమలాంటి వారందరికి ఆ మహనీయుడి వల్లే పదవులు వచ్చాయని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో విండో అధ్యక్షులు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలకిష్టన్న, మహేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌, రహ్మతుల్లా, పరమేష్‌, తుల సీరాజ్‌, శ్రీను, అజ్మతుల్లా, విజయ్‌, గాలిపంపు శ్రీను, అంబేడ్కర్‌ సంఘం నాయకులు ఉన్నారు.

'ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించండి'


మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వనపర్తి జర్నలిస్ట్‌ సంఘం నాయకులు

వనపర్తి: వనపర్తి జిల్లాగా ఏర్పడినప్పటి నుంచి జిల్లా కేంద్రంలో వర్కింగ్‌ జర్నలిస్టుల కోసం ప్రెస్‌ క్లబ్‌ లేదని, వెంటనే స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సురవరం ప్రతాపరెడ్డి వనపర్తి ప్రెస్‌ ఫౌండర్‌ కమిటీ ఆధ్వర్యంలో వర్కింగ్‌ జర్నలిస్టులు రాష్ట్ర పౌర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. బుధవారం వనపర్తి జిల్లాలో మంత్రి పర్యటించిన సందర్భంగా కల్యాణ సాయి ఫంక్షన్‌ హాల్లో ఎమ్మెల్యే తూడిమేగారెడ్డి ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల వినతిని పరిశీలించిన మంత్రి వెంటనే స్థలం కేటాయించడంతో పాటు, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. కొత్తగా స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేసే లోపు జిల్లా కేంద్రంలోని ఏదైనా ప్రభుత్వ భవనం లేదా తాత్కాలిక భవనంలో తమకు ప్రెస్‌ క్లబ్‌ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. శాశ్వత భవనం కోసం వీలైనంత తొందరగా స్థలం కేటాయింపుతో పాటు నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేగారెడ్డికి వనపర్తి వర్కింగ్‌ జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బలమోని రమేష్‌, మాకం జాని, నోముల రవీందర్‌ రెడ్డి, శ్రీధర్‌ రావు, కొండన్న యాదవ్‌, , భాస్కర్‌, వెంకట్‌ గౌడ్‌, శ్రీనివాసరావు, ఖలీల్‌, దినేష్‌, కుమార్‌, శ్రీనాథ్‌, తరుణ్‌, గోపాల్‌ పాల్గొన్నారు.

తెలుగు కవిత్వాన్ని రక్షించిన శ్రీశ్రీ


శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి విద్యావిభాగం: అభ్యుదయ కవితా వైతాళికుడు విప్లవ కవిత చోదకుడు శ్రీశ్రీ 115 జయంతి వేడుకలను మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్‌ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్‌ ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాష్‌ మాట్లాడారు. తెలుగు కవిత్వాన్ని మరో మలుపు తిప్పిన మహాకవి శ్రీశ్రీ, మహాప్రస్థానం 1950లో పుస్తక రూపం ధరించిందన్నారు. 1955లో అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడయ్యారన్నారు. కార్యక్రమంలో భూరోజు గిరిరాజాచారి, మండ్ల దేవన్ననాయుడు, వెంకటేష్‌, ఎర్రం భాస్కర్‌, బక్కన్న, మురళి, నర్సింహ, కురుమూర్తి, వెంకటస్వామి, రాంబాబు, రమేష్‌ ఉన్నారు.

ఆదర్శప్రాయుడు బసవేశ్వరుడు


బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్‌

వనపర్తి: శ్రమను మించిన సౌందర్యం లేదు, కుల మతాలు లేవు మనుషులందరూ ఒక్కటే అని చాటి చెప్పిన విశ్వకర్మ బసవేశ్వరుడు ఆదర్శ ప్రాయుడని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, కలెక్టర్‌ ఆదర్శ్‌ సురభి అన్నారు. బుధవారం మహాత్మా బసవేశ్వర జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, కలెక్టర్‌, అదనపు కలెక్టర్‌ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, సంఘ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 12వ శతాబ్దానికి చెందిన బసవేశ్వరుడు మానవులంతా ఒక్కటే అని, కుల మతాలు లేవని ప్రగాఢంగా నమ్మి ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. మూఢ నమ్మకాలు నమ్మొద్దని, సమానత్వం, సోషలిజం వంటి సిద్ధాంతాలను ప్రచారం చేసి ప్రజలకు దిశానిర్దేశం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌ రెడ్డి, ఆర్డీఓ సుబ్రమణ్యం, జిల్లా అధికారులు, సంఘం నాయకులు ఉన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

అమరచింత: నిజమైన పేదలకే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని వార్డులలో నిరుపేదల సర్వే నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య, నాయకులు మేర్వరాజులు 10 వార్డులలో లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలిపారు. స్థానిక కాంగ్రెస్‌ పార్టీ నాయకులు తయారు చేసిన జాబితా ప్రకారం ఎమ్మెల్యే ఇళ్లను మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నిజమైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి ఎంపీ డీకే అరుణకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్‌, దుబాయ్‌ వెంకటేశ్వర్‌ రెడ్డి పాల్గొన్నారు.

బెదిరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

వనపర్తి విద్యావిభాగం: విద్యుత్‌ శాఖలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న జిల్లా కేంద్రానికి చెందిన సాయిచంద్రప్రసాద్‌ నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలంటూ విద్యుత్‌శాఖలో అకౌంట్స్‌ ఆఫీసర్‌ వెంకటరమణ పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ హరిప్రసాద్‌ వివరాల ప్రకారం.. సాయిచంద్రప్రసాద్‌ అనే కాంట్రాక్టర్‌ గత నెల 21న విద్యుత్‌ ఉద్యోగులపై అసభ్య పదజాలంతో దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించడంతో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అతను ముందస్తు బెయిల్‌పై ఉన్నాడని, అయినా తన తీరు మార్చుకోకుండా గతంలో ఫిర్యాదు చేసిన వెంకటరమణపై కక్ష్యతో మంగళవారం కార్యాలయంలో అతని దగ్గరకు వెళ్లి అవసరం లేకున్నా భయాందోళనకు గురి చేస్తున్నట్లు తెలిపారు. సాయిచంద్రప్రసాద్‌ నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పాన్‌గల్‌: మండలంలోని మాందాపూర్‌ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ నాయకులు పుచ్చల పరమేశ్వర్‌ రెడ్డి సతీమణి పుచ్చల పద్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు, జ్యోతినందన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డా.చిన్నారెడ్డి పరామర్శ

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి మాందాపూర్‌ గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



వనపర్తి రూరల్‌: పెబ్బేరు మండల కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి అంబాత్రయ క్షేత్ర వ్యవస్థాపకులు ఆధ్యాత్మిక పరిశోధకులు డాక్టర్‌ అధిత్యపరాశ్రీ గురువుగారు, శ్రీ మని ప్రపంచమ సిద్ధిలింగ పశ్చిమాద్రి సంస్థాన విరక్తమఠం పీఠాధిపతులు హాజరయ్యారు. బుధవారం సుకుంలమ్మ ఆలయం నుంచి బైక్‌ ర్యాలీతో అయ్యప్ప ఆలయానికి చేరుకొని లలితా త్రిపుర, నవగ్రహాల యంత్ర ప్రతిష్ఠ, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం కమ్యూనిటీ హాల్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో హిందూ జాగృతం సభ్యులు, ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం



గోపాల్‌పేట: మండలంలోని చాకల్‌పల్లి గ్రామానికి చెందిన విద్యావతి, నర్సింగాయపల్లికి చెందిన అనసూయ అంగన్‌వాడీ టీచర్లు 65 ఏళ్ల పూర్తయిన సందర్భంగా వారికి బుధవారం మండల కేంద్రంలో పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారిణి సుధారాణి హాజరయ్యారు. అంగన్‌వాడీ టీచర్‌కు ఎన్నో బాధ్యతలు ఉంటాయని, సర్వీస్‌లో సుమారు నలభై ఏళ్లకు పైగా ఉండి కష్టపడి సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఇద్దరిని సన్మానించారు. ప్రాజెక్టు అధికారిణి హజీరాబేగం, సూపర్‌వైజర్‌ వసంత, పోషణ అభియాన్‌ బీసీ శేఖర్‌, మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించాలి

పాన్‌గల్‌: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నర్సింగ్‌ విద్యార్థిని మనిషాశ్రీ కుటుంబానికి ప్రభుత్వ పరంగా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని కొల్లాపూర్‌ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. బుధవారం రాయినిపల్లి గ్రామానికి చేరుకొని విద్యార్థిని కుటుంబ సభ్యులను పరామర్శించారు. విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు, దశరథ నాయుడు, రమణయ్య పాల్గొన్నారు.

ఇద్దరికి రిమాండ్‌

గోపాల్‌పేట: మోటారు చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌ చేశామని గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌ కుమార్‌ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. మండలంలోని చాకల్‌పల్లి గ్రామానికి చెందిన లొంక లక్ష్మరెడ్డి ఈనెల 27న గుర్తుతెలియని వ్యక్తులు తన మోటార్‌ దొంగతనం చేశారని ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేశారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా కొంకలి శివుడు, మండ్ల జనార్దన్‌ ఇద్దరూ ద్విచక్ర వాహనంపై మోటారు తీసుకెళ్తుండగా పట్టుకుని విచారించారు. మోటారు అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. గతంలో చాకల్‌పల్లి గ్రామానికి చెందిన పోతుల కృష్ణారెడ్డి మోటారు దొంగతనం చేశామని ఒప్పుకున్నారు. దీంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని, రెండు మోటార్లు, ద్విచక్ర వాహనం సీజ్‌ చేసి బుధవారం రిమాండ్‌ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే



కొత్తకోట రూరల్‌: మండలంలోని 24 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే బుధవారం ముగిసినట్టు తహసీల్దార్‌ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందని తహసీల్దార్‌ పేర్కొన్నారు. గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీల నిర్ణయం మేరకే ఎంపిక చేయడం జరిగిందని, ఇళ్లు లేని స్థలం ఉన్న వారిని మొదటి జాబితాలో ఎంపిక చేసినట్లు తెలిపారు.

అంకిత భావంతో పని చేయాలి


ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

వనపర్తిటౌన్‌: ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని వనపర్తి ఆర్టీసీ డీఎం వేణుగోపాల్‌ అన్నారు. వనపర్తి ఆర్టీసీ డిపోలో కండక్టర్లు మహేహేశ్వర్‌ గౌడ్‌, వి. శ్రీనివాసులు, డ్రైవర్‌ కె. శ్రీనివాసులు, కంట్రోలర్‌ వీఎస్‌ చారి ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆర్టీసీ డిపోలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో మూడు దశాబ్దాల పాటు సేవలు అందించి ప్రభుత్వ రంగ సంస్థలో కుటుంబ సభ్యుల్లా మమేకం అయ్యారని, పదవీ విరమణ బాధ కలిగించిన ఉద్యోగ జీవితంలో తప్పదన్నారు. కార్యక్రమానికి హాజరైన సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌, జిల్లా సమన్వయకర్త బైరోజు చంద్రశేఖర్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్‌ వేణుగోపాల్‌, డిపో సిబ్బంది, మెకానిక్‌ స్టాఫ్‌, తదితరులు, వారి కుటుంబ సభ్యులు ఉద్యోగ విరమణ పొందిన వారిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎఫ్‌ దేవేందర్‌, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

కామన్‌ కమ్యూనిటీ హాళ్లకు మోక్షమెప్పుడో?

- రెండు మండలాల్లో నిలిచిన పనులు
- గోపాల్‌పేటలో మద్యం ప్రియులకు అడ్డాగా..
- పూర్తి చేసి వినియోగంలోకి తేవాలి


గోపాల్‌పేటలో అసంపూర్తిగా కామన్‌ కమ్యూనిటీ హాల్‌ (ఫైల్‌)

గోపాల్‌పేట: అన్ని వర్గాల ప్రజలు చిన్నచిన్న సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు, ఇతర అవసరాలకోసం వినియోగించుకోవచ్చని తెలంగాణ ప్రభుత్వం 2022లో మండలానికి ఒక కామన్‌ కమ్యూనిటీ హాల్‌ను కేటాయించింది. రూ.75 లక్షలతో నిర్మించాలని ఆయా మండలాల్లో స్థలం సేకరించి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు ప్రారంభమై మూడేళ్లైనా గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో పనులు పూర్తి కాలేదు. గోపాల్‌పేటలో సుమారు తొంబైశాతం పనులు పూర్తయ్యాయి. రేవల్లి మండలంలో స్లాబ్‌ వరకు పూర్తి అయింది. గోడలు, ఇతర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి నిర్మాణం మండల కేంద్రాలకు కొద్ది దూరంలో ఉండటంతో మద్యం ప్రియులకు అడ్డాగా మారాయి. పెండింగ్‌ పనులు వెంటనే పూర్తిచేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

■ గోపాల్‌పేట మండల కేంద్రంలో 2022లో కాంట్రాక్టర్‌ కామన్‌ కమ్యూనిటీ హాల్‌ నిర్మాణం పనులు ప్రారంభించాడు. 2024 డిసెంబరు లోపుపనులు దాదాపు తొంబైశాతం పూర్తి చేశాడు. నిధులు సరిపోలేదని మరో పది లక్షలు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యేను కోరగా, ఐదు లక్షలు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారు. పెండింగ్‌లో ఉన్న పనుల్లో ప్లంబింగ్‌, కరెంటు, వైట్‌ పెయింట్‌ వేయించారు. మరో రూ.15లక్షలు ఇస్తేనే పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని కాంట్రాక్టర్‌ పేర్కొన్నాడు. ప్రస్తుతం కలర్‌, గ్రిల్స్‌, కాంపౌండ్‌, లేవలింగ్‌, బోర్‌ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

■ రేవల్లి మండల కేంద్రంలో ఉన్న కామన్‌ కమ్యూనిటీ హాల్‌ పనులు స్లాబ్‌ వరకు పూర్తి చేశారు. బిల్లు కాకపోవడంతో పనులు నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. తొందరలోనే బిల్లు అవుతుందని, వీలైనంత తొందరలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పంచాయతీరాజ్‌ అధికారులు చెబుతున్నారు. కమ్యూనిటీ హాళ్ల పనులు పూర్తి అయితే కాంపౌండ్‌ నిర్మించి అవసరాలకు మాత్రమే వాడుకునేందుకు అవకాశం ఉంటుందని ప్రజలు చెబుతున్నారు.

తొందరగా పూర్తి చేయాలి



గోపాల్‌పేట మండల కేంద్రంలో కామన్‌ కమ్యూనిటీ హాల్‌ తొందరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. అసంపూర్తిగా ఉండటంతో కొంతమంది యువకులు మద్యం, సిగరెట్లు తాగేందుకు వినియోగిస్తున్నారు. పనులు తొందరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తే అందరికీ బాగుంటుంది. అధికారులు చొరవతీసుకుని పనులు పూర్తి చేయాలి. – శివ, బీజేవైఎం, గోపాల్‌పేట

బిల్లులు రాగానే పూర్తి చేయిస్తాం..

గోపాల్‌పేట, రేవల్లి మండల కేంద్రాల్లో కామన్‌ కమ్యూనిటీ హాళ్ల పనులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. గోపాల్‌పేటలో బడ్జెట్‌ కావాలని చెప్పారు. మేము పెట్టాం బడ్జెట్‌ రాగానే పూర్తి చేయిస్తాం. రేవల్లిలో రూ.35 లక్షలు మొదటి బిల్‌ పెట్టుకున్నారు. తొందరలోనే బిల్లు వచ్చేఅవకాశం ఉంది. అది కూడా పూర్తి చేయిస్తాం. – భాస్కర్‌, ఏఈ పంచాయతీరాజ్‌, గోపాల్‌పేట